"శ్రీమద్రమా రమణ గోవిందో హరి!" అని గట్టిగా అరుస్తూ, మరింత హుషారుగా, ఉత్సాహంగా తన హరికథ కొనసాగించాడు వెంకటరమణ హరిదాసు. అది గజేంద్ర మోక్షానికి సంబంధించిన హరికథ. అందులోను ఆయన ఆ వేళ భాగవతంలోవి కొన్ని పద్యాలు కూడా ఉదాహరించాడు.

# దేవుడు లేడు, లేడు, లేడు!

పి. గణపతి శాస్త్రి

ఆ కథ చెప్పడంలో వెంకటరమణ చాలా గట్టి దిట్ట అన్న పేరుకూడా గడించుకున్నాడు. మధ్య మధ్యన పిట్టకథలతో, హాస్యకథలతో, ఛలోక్తులతో, కమ్మని కీర్తనలతో శ్రోతలను ఘూతలూగిస్తూ అందరినీ ఎంతో గొప్పగా ఆకట్టుకున్నాడు హరిదాసు.

మాది చాలా పెద్ద గ్రామం. ఆయన కథ వినాలన్న తహతహతో ఆ నాటి రాత్రి ఆ హాలులో అయిదారు వేలమంది దాకా జనం గుమిగూడారు చేతి తాళాల మోతలతో, గజ్జెల ఘలం ఘలంతో, ఫిడేలు పక్కవాద్యంతో, హార్మనీ శ్రుతిలో ఆయన క్రమక్రమంగా చిన్న చిన్న నృత్యాలు కూడా ప్రారంభించాడు. "సిరికిం జెప్పడు" అన్న భాగవత పద్యం రాగవరసతో చదువుతూ, గజేంద్రుని మొరవిని ఆ శ్రీహరి అతి త్వరితంగా నేలమీదికి దిగివస్తున్న తీరు, ఆ హరిదాసు వర్ణించే సమయంలో హాలు హాలంతా చప్పట్లతో, హర్షధ్వానాలతో హోరుమని మారుమోగింది. క్రమ క్రమంగా హాలంతా నిమ్మకి నీరెత్తినట్టు నిశ్శబ్దమయింది. శ్రోతలందరు చెవులు రిక్కించి వింటున్నారు. అప్పుడప్పుడు హాలులోకి వస్తున్న కొంతమంది మనుష్యుల సవ్వడి తప్ప మరేమీ వినబడంలేదు.

అంతలోనే ఆ హాలులో ఒకమూల చిన్న కలకలం చెలరేగింది. ఆపైన సన్నగా, పొడుగ్గా, నల్లగా ఉన్న యువకుడు ఒకడు తటాలున లేచి నిలుచున్నాడు. మొట్టమొదట అతనిసంగతి ఎవ్వరూ పట్టించుకోలేదు. కాని మరుక్షణంలోనే అతగాడు "దేవుడు లేడు! లేడు!" అని గొంతెత్తి అరవడం ప్రారంభించాడు. అతని కంఠం క్రమంగా మరింతగా రెచ్చింది.

దానితో ఆ ప్రాంతంలోనే కాక హాలు నలుమూలలా పెద్ద గందరగోళం ప్రారంభమయింది- చాలా మంది ఆ గొడవ బయలుదేరిన ప్రాంతానికి పరుగులు పెట్టారు. చేతులు పట్టుకుని ఆ యువకుణ్ణి బలవంతంగా కూర్చోబెట్టారు. మరి గొడవచేస్తే మాటదక్కదని గట్టిగా హెచ్చరించారు. కొందరు అతగాణ్ణి హాలులోనించి బయటికి పంపించివెయ్యాలని కూడా ఆలోచించారు. "ఆ అబ్బాయి కేమన్నా మతిగాని పోయిందేమిటి?" అన్నాడింకొక ఆసామి. కాని ఆ యువకుడు వారి మాటలేవీ పట్టించుకోలేదు. మరి గత్యంతరమేమీ లేక రుసరుసలాడుతూ నేలమీద చతికిలబడ్డాడు.

ఆ గలభా అంతా గమనించి హరిదాసు నిలువునా నిర్ఘాంతపడ్డాడు. అతని ఉత్సాహం అంతా నీరుగారిపోయింది. అయినా అనేక చోట్ల ధక్కా మొక్కీలుతిన్న ఘటం కనుక తమాయించుకుని నిలబడ్డాడు. హాలంతా సద్దుమణిగాక, మళ్ళీ గజేంద్రమోక్షంకథ ప్రారంభించాడు. తిరిగి ఫిడేలు పక్కవాద్యంతో, హార్మనీ శ్రుతితో, గజ్జెల మోతతో, తాళాల ధణం ధణలతో హాలంతా మారుమోగింది.

ఆ యువకుడు అలాగే ధుమధుమలాడుతూ కూర్చున్నాడు. అతని పేరు ఆంజనేయులు. చాలా తెలివయినవాడు. తన కాలేజీ కంతటికి ఫస్టులో బియ్యే పాసయ్యాడు. కాని అతనికెంత ప్రయత్నించినా ఎక్కడా మంచి ఉద్యోగం దొరకలేదు. అయిదారు నెలలపాటు తాత్కాలికంగా ఒక చిన్న ఉద్యోగం దొరికింది. అంతే!

ఆ తరవాత బాంకుల పరీక్షలకు కొన్నింటికి హాజరయ్యాడు. పరీక్షలేమో చాలా బాగానే రాశాననుకున్నాడు. కాని పాసయిన వాళ్ళ లిస్టులో అతని పేరు కనబడలేదు! ఆ తరవాత ఒక ప్రయివేటు కంపెనీలో అతి కష్టంమీద ఒక చిన్న ఉద్యోగం సంపాదించుకున్నాడు. కాని అది ఆట్టేకాలం కొనసాగలేదు! అదేమి దురదృష్టమోగాని ఆంజనేయులు ఎన్నెన్ని విధాల ప్రయత్నించినా ఆ తరవాత ఎక్కడా ఉద్యోగం దొరకలేదు! నలుగురూ అతడు చాలా దురదృష్టవంతుడని అనుకునేవారు. పైకి ఆంజనేయులు కొంత మోటుగా, అనాకారిగా కనిపిస్తాడు. కాని లోలోపల జాలిగూడు కట్టుకున్నట్టుంటాయి అతని చురుకు చూపులు.

ఆంజనేయులికి మరి పెళ్ళికాదని నిరాశ చేసుకున్న అక్కలిద్దరున్నారు. వారి చదువు అంతగా పైకి పాకలేదు. అందుచేత ఉద్యోగాలెక్కడా దొరకలేదు. వారిద్దరు తల్లి గుండెపై కుంపట్లలాగ ఇంట్లోనే వుండిపోయారు. బి.య్యే. చదువుకునే రోజుల్లోనే ఆంజనేయులు తండ్రి పోయాడు. మా




ఊళ్ళో అతనికొక చిన్న ఇల్లు తప్ప వేరే ఆస్తిపాస్తులేవీ లేవు. తల్లి ఒంటిమీద నగ లమ్మి ఆంజనేయులు తన తమ్ముళ్ళ కిద్దరికి అతికష్టం మీద చదువులు చెప్పించగలుగుతున్నాడు.

క్రమక్రమంగా ఆంజనేయులు కుటుంబ పరిస్థితి అధ్వాన్నమయింది. ఒక్కొక్కప్పుడు అతనికి ఆ పూట గడవడమే గగనమయింది. 'ఇంక ముమ్ముందు బండి నడవడమెలాగ?' అన్న మథన నానాటికి అతని నవనాడులు కుంగదీయసాగింది. ఆ పరిస్థితుల్లో అతనికి రాజకీయాల్లో ఒక వామపక్షంలో తీవ్రవాదులయిన కొందరితో గట్టి పరిచయం కలిగింది.


దానితో అతనికి ఒక కొత్త లోకంలో అడుగు పెట్టినట్లనిపించింది! గొప్ప కనువిప్పు కలిగినట్లనిపించింది! ఆ తరువాత అతనికి మన సాంఘిక వ్యవస్థ అంతా కూకటి వేళ్ళతో పెకలించి, ఒక కొత్త సామ్యవాదవ్యవస్థ నిర్మిస్తేతప్ప, జనానికింక గత్యంతరమేదీ లేదన్న దృఢ నిశ్చయం కలిగింది.

దేవుళ్ళు, దేవతలు, లేనిపోని మూఢ నమ్మకాలు, చాదస్తాలు, వెర్రి మొర్రి ఆచారాలు మొదలయినవన్నీ కలిసి మన దేశాన్ని అధోగతి కీడ్చుకునిపోతున్నాయని అతని అంతర్యంలో విపరీతమయిన ఆరాటం బయలుదేరింది. వీటన్నిటితోను కలిపి మన సాంఘిక వ్యవస్థ అంతా నిర్మూలించి తీరాలన్న ఆవేశం పుంజుకుంది. అప్పటినించి ఆంజనేయులు మా ఊళ్ళో ఒక నాస్తిక సమాజం ఏర్పరిచి నాస్తిక ధోరణికి సంబంధించిన చర్చలు, గోష్ఠులు, ఇంకా కొన్ని ఇతర రాజకీయ కార్యక్రమాలు, సభలు సమావేశాలు నడిపించాడు

అందువల్లనే అతనికి ఆనాటి హరికథ వల్ల జనంలో బలపడుతున్న వెర్రిభక్తి, ఆవేశం గమనిస్తున్న కొద్దీ శరీరం మీద తేళ్ళు, జెర్రులు పాకుతున్నట్టనిపించింది. కనకనే మరి వుండబట్టలేక హాలులో నిలబడి ఆ విధంగా కేకలారంభించాడు.

ఆంజనేయులు కొంతసేపు అలాగ కిమ్మనకుండా మాట్లాడకూరుకున్నాడు! కాని అతని లోలోపలినించి వట్టలేని ఉక్రోషం, ఆగ్రహం పరవళ్ళు తొక్కుతూనే వున్నాయి. అదే సమయంలో ఆ హరిదాసు ప్రజల్లో దేవుడున్నాడన్న గట్టి నమ్మకం కలిగించాలన్న పట్టుదలతో ఇంకొక పిట్టకథ అందుకుని అసలు గజేంద్రమోక్షం కథకు దానికి ముడివేశాడు. ఆంజనేయుల్ని అందరిలోను నవ్వులపాలు చేయాలన్న ఆలోచనతో ఒక హాస్య కథ చెప్పి శ్రోతలందరిచేత చప్పట్లు కొట్టించాడు.

పామరజనంలో ఆ మూఢభక్తి, వెర్రి ఆవేశం గమనించగానే ఆంజనేయులు ఒక్కసారిగా లేచి నిలిచి అదేపనిగా దేవుడు లేడని అరవడం మొదలుపెట్టాడు. ఆ ధోరణి గమనించి కొందరతనికి మతిగాని తప్పిందేమోనని అనుమానించారు. అందుచేత ఆంజనేయుల్ని మంచి మాటలతో వీధిలోకి పంపించివెయ్యాలని కూడా ఆలోచించారు. మరి కొందరతని నోరు మూయించి




కూర్చోబెట్టాలని తొందరగా అతని వైపు సాగిపోయారు.

తిరిగి హాలులో నల్గువైపుల గందరగోళం ప్రారంభమయింది. హరిదాసు అలాగే నిలబడిపోయాడు. "ఆ అంజిగాణ్ణి నాలుగు తన్ని వీధిలోకి నెట్టండిరా!" అని ఒకరిద్దరు కేకలుపెట్టారు. నిజానికి వారికి కథ మధ్యలో ఆగిపోయినందుకు ఏమాత్రము విచారం కలగలేదు! దేవుడు లేడన్నందుకే అంతటికోపం రాజుకుంది. అయినా ఆంజనేయులు లక్ష్యపెట్ట లేదు. అంతలోనే నలుగురయిదుగురు అతని చెయ్యిదొరక బుచ్చుకుని వీధిలో కీడ్చుకుపోవాలని ప్రయత్నించారు. అయినా ఆంజనేయులు వారితో పెనగులాడ్డం మానలేదు!

అదే క్షణంలో హాలులో నలువైపులా "ఆగండి!" అన్న పెద్ద గావుకేక మారుమోగింది!

"ఆగండిరా! ఎర్రినాగమ్మల్లారా! ఆగండి! ఎందుకలాగ తొందరపడి ఆ అంజి మీద ఇరుసుకుపడతారు? తమాయించండి! కొంచెం నామాట విని తమాయించండి!"

ఆ అరుపు వినగానే ఎక్కడివారక్కడ హాలులో స్తంభాల్లాగ నిశ్చలంగా నిలబడిపోయారు.

ఆ కేక పెట్టిన ఆసామీ మా ఊళ్ళో రౌడీలందరికి పెద్ద రౌడీ రంగయ్య. అతగాడు ఆజానుబాహువు. ఉక్కుముక్క లాంటి మనిషి. తాగుడు. పేకాట మొదలయిన వ్యసనాల్లో అతనిలో లేనివేవీలేవు! కాని తలుచుకుంటే ఊళ్ళో ఎవరికైనా తలలో నాలికలా మంచిగా సాయపడగలడు. పగబడితే ఎంతెంతటి వారి చేతనయినా మూడు చెరువులనీళ్ళ తాగించి ముప్పతిప్పలు పెట్టగలడు.

మా ఊళ్ళో రామ మందిరంలో ఉత్సవాలకు. ఊరేగింపులకు అప్పుడప్పుడు సాయపడుతూంటాడు. పొద్దున్నే లేచి అరచేతిలో 'రామ' అని రాసి దానికేసి చూసుకుంటాడు! అంతే! రంగయ్య ఆనాడు చిత్తుగా తీర్థం పుచ్చుకున్నాడులావుంది! కళ్ళు రెండు బాగా ఎర్రబడ్డాయి. అలాగ అందరినీ హెచ్చరించిన తరవాత అతడు తూలిపోతూ పెద్దపెద్ద అంగలు వేసుకుంటూ వెళ్ళి ఆంజనేయులు పక్కగా నిలబడ్డాడు. ఆ తరువాత అతని జెబ్బ పుచ్చుకుని పైకి లేవనెత్తాడు. ఆ పైన రంగయ్య ఒక్క వూపులో అంజిని వీధిలోకివిసిరివేస్తాడేమోఅని అందరూ కంగారు పడ్డారు. కాని అలాంటి విడ్డూరమేదీ జరగలేదు! మరుక్షణంలోనే రంగయ్య హుమ్మని హుంకరించిసభ్యులందరినీ హెచ్చరించాడు.

"బాబులూ! ఎందుకలాగ గంగవెర్రులెత్తిపోతారు? ఇదిగో. ఈ అంజికేసి చూశారా? ఆంజనేయులన్న పేరేగాని ఉప్పూని ఊత్తే. ఆకాశాని కెగిరిపోయేలాగున్నాడు! ఎందుకురా! ఇంతమందీ ఏకమై ఇతగాడిమీద విరుచుకుపడతారు!"

ఆ ప్రశ్నతో హాలంతా నిశ్శబ్దమయింది. అంతలోనే రౌడీ రంగయ్య మళ్ళి అందుకున్నాడు.

"ఈ రివట నాగమ్మ లేడనగానే అంతటి దేవుడు ఒక్కమాటుగాలిలో దూదిపింజెనాగ ఎగిరిపోతాడంట్రా బాబులూ?" అలాగంటూనే రంగయ్య విరగబడి నవ్వడం మొదలుపెట్టాడు.

అంతలోనే తేరుకుని మళ్ళి మొదలుపెట్టాడు.

"ఒకవేళ ఈడు లేడనగానే. ఆ దేవుడు కూడా లేకుండా ఎగిరిపోతే. అనుమంటి దద్దమ్మ దేవుడి వల్ల మీకేటి నాబం? నాకేంటి నాబం? ఈ పెపంచకాని కేటి నాబం? ఈ కుర్ర నాగమ్మ మీద ఎందుకలాగ ఇరుసుకుపడతారు! కాస్త నిదానించి. తమాయించుకోండి బాబుల్లూ!"

ఆ మాటతో హాలులో చెలరేగిన ఆవేశం అంతా చల్లారింది. చిన్న నవ్వులు. నిట్టూర్పులు కూడా ప్రారంభమయ్యాయి. అదే సమయంలో రంగయ్య ఆంజనేయులు కేసి తిరిగాడు.

"అంజీ! నేనునున్నానుగా! నీ కెలాంటి భయమూలేదు! నీ కెన్నిసార్లు దేవుడు లేడని అరవాలనిపిస్తే. అన్నిసార్లు అరవరా! నేనున్నానుగా! నీ కేఫీ భయంలేదులే!"

ఆ పరిణామంతో ఆంజనేయులు నోట మరిమాట పెగల్లేదు. బిక్కజచ్చిపోయి నోరు తెరుచుకుని నిలుచున్నాడు. అంతలోనే మళ్ళి హుంకరించాడు రంగయ్య.

"ఎందుకలాగ తటపటాయిస్తావు? మరేం భయం లేదులే! నీ ఇష్టం వచ్చినట్టు కేకలు పెట్టరా అంజీ!"

ఆంజనేయులుకి రంగయ్య మాట పాటించక తప్పలేదు. "దేవుడు లేడు. లేడు. లేడు!" అంటూ రెండు మూడుసార్లు గొంతెత్తి అరిచాడు.

వెంటనే హాలులో అంతటా నవ్వులారంభమయ్యాయి. అదే సమయంలో రంగయ్య వెంకటరమణకేసి తిరిగి గద్దించాడు.

"ఎందుకయ్యా. హరిదాసూ? అలాగ తెల్లబోయి చూస్తూ నిలబడ్డావు! మళ్ళి కథ మొదలుపెట్టి కడకంటా కానియ్యవయ్యా!"

హరిదాసు తిరిగి తన కథ మొదలుపెట్టాడు. హాలులో చప్పట్లు. నవ్వులు నలువైపులా అల్లుకున్నాయి.

ఇంకొక అరగంటలోనే గజేంద్ర మోక్షం ముగిసింది. హరిదాసు మంగళం పాడి సదస్యులందరి మన్ననలు అందుకున్నాడు.

"శ్రీమద్రమా రమణ గోవిందో హరి" అంటూ ఆనాటి తన కార్యక్రమం యావత్తు పూర్తిగా ముగించుకున్నాడు!

